క్లుప్తంగా

సూర్యఘర్ యోజనను వినియోగించుకోండి


ఏఈ పి.రమేష్‌కుమార్

సామర్లకోట: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద సబ్సిడీపై లభిస్తున్న సోలార్ రూఫ్ టాప్‌ను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ట్రాన్స్‌కో సామర్లకోట ఏఈ పలివెల రమేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ పథకంలో ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్‌ను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ఇందులో భాగంగా సబ్సిడీపై సోలార్ విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోల వాట్స్‌కు రూ.60 వేలు, మూడు కిలోల వాట్స్‌కు రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. సోలార్ విద్యుత్‌పై ఆసక్తి ఉన్నవారు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


ఉప్పాడ ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. మండలంలోని ఉప్పాడ శివారు సూరడపేటలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పిల్లలతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓ వేణుగోపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

సామర్లకోట: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై వీఆర్ మూర్తి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి నలుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడపడంతో, వారిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. మంగళవారం వారిని కోర్టుకు తరలించామన్నారు. కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు ఇద్దరికి రూ.10 వేల చొప్పున జరిమానా, మరో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్టు తెలిపారు.

పిఠాపురం: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి మంగళవారం కోర్టు జరిమానాలు విధించిందని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో భాగంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందిని గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. పిఠాపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.వెంకట అపర్ణ ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు.

పూడికతీతతో ముంపు సమస్యకు పరిష్కారం


సామర్లకోటలో ప్రధాన డ్రైన్‌లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: పట్టణంలోని ప్రధాన డ్రైన్‌లో పూడికలు తీయడం ద్వారా ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక గాంధీచౌక్ నుంచి ఏలేరు కాలువ వరకున్న ప్రధాన డ్రైన్‌లో పూడికతీత పనులను మంగళవారం ఎమ్మెల్యే పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని అనేక ప్రాంతాల నుంచి డ్రైన్ల ద్వారా మురుగు నీరు గాంధీ చౌక్‌లో ఉన్న పిల్ల కాలువ (ప్రధాన డ్రైన్) నుంచి ఏలేరు కాలువలోకి వెళుతుంది. ఈ ప్రధాన డ్రైన్‌లో పూడికతీత చేపట్టకపోవడంతో, పట్టణంలో డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. దాంతో ప్రధాన డ్రైన్‌ను మూసివేసిన తుప్పలను తొలగించడంతో పాటు, పూడికతీత పనులు చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బలుసు వాసు, రైతు సంఘ నాయకుడు కంటే బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, సానిపిని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బోట్ల వేలం

కాకినాడ క్రైం: కాకినాడ పోర్టు పోలీస్ స్టేషన్‌లో సారా కేసులో పట్టుబడ్డ ద్విచక్ర వాహనం, బోట్లను మంగళవారం వేలం ప్రక్రియ ద్వారా విక్రయించారు. సెబ్ డీఎస్పీ ఏఎస్ దొర ఆధ్వర్యంలో పోర్టు సీఐ సునీల్‌కుమార్ సమక్షంలో ఈ వేలంపాట జరిగింది. ఈ వేలం ద్వారా సుమారు రూ.1.6 లక్షలు సమకూరిందని అధికారులు తెలిపారు.

కష్టకారం

- మిరప పంటకు ముంపు బెడద
- నేలకొరిగిన మొక్కలు
- తెగుళ్లు సోకే అవకాశం
- జాగ్రత్తలు పాటించాలంటున్న ఉద్యాన శాఖ అధికారులు


గొల్లప్రోలు మండలంలో ముంపులో ఉన్న బంతి తోట


గొల్లప్రోలు మండలం చెందుర్తిలో నీటమునిగిన మిరప పంట

పిఠాపురం: ఎండావాన ఒకదాని తరువాత ఒకటి వస్తుంటే ఉద్యాన పంటలకు నష్టం కలిగే అవకాశాలుంటాయి. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో మిరప పంటలు అధికంగా సాగవుతున్నాయి. ప్రస్తుత వర్షాలతో మిరప పంటలు ముంపు బారిన పడ్డాయి. వర్షాలకు మొక్కలు నేలకొరగ్గా, నష్టాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా పంటలను సంరక్షించుకుని, నష్టాలను నివారించవచ్చంటున్నారు ఉద్యాన అధికారులు. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు వారు పలు సూచనలు చేస్తున్నారు.

వర్షాల వల్ల మిరపకు నష్టం

అధిక వర్షాల వలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడి, పంట ముంపు బారిన పడే అవకాశాలున్నాయి. తద్వారా అధిక తేమ వల్ల వేర్ల ద్వారా మొక్కకు అవసరమైన పోషకాలను తీసుకోలేదు. దీంతో పంటను పురుగులు, తెగుళ్ల ఆశించడమే కాకుండా, సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువ కనిపిస్తాయి. పంట దశ ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రత్తలు తీసుకుంటే పంటను రక్షించుకోవడంతో పాటు, నష్టాలను నివారించుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేయాలి. వాలిన మొక్కలను నిలబెట్టి, మొదలులో మట్టిని వేసి బలంగా ఉండేలా చూడాలి. నేల వాలిన మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పైపాటుగా అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ , 200 కిలోల వేప పిండి వేయాలి. నేల అదనుకు వచ్చిన వెంటనే గొర్రుతో అంతర కృషి చేయాలి. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములను లీటరు నీటికి, సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి ఒకదాని తరువాత ఒకటి, వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా, ఆకుమచ్చ, కానోఫరా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక గ్రాము, స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా వాటి వ్యాప్తిని అరికట్టవచ్చు. మిరప పంట పూర్తిగా ముంపునకు గురై, పూర్తిగా నష్టం వాటిల్లితే పంటను తీసివేసి, ప్రత్యామ్నాయంగా మరో పంటను సాగు చేసుకోవాలి.

నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలు (ప్రాథమిక అంచనా)	
మిరప	71 హెక్టార్లు
బంతి	4 హెక్టార్లు


మిరప రైతులకు సూచనలు ఇస్తున్న పిఠాపురం ఉద్యాన శాఖాధికారి సత్య శైలజ

చిన్నపాటి జాగ్రత్తలతో..

నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో వాణిజ్య పంటలను పరిశీలించాం. రైతు సేవా కేంద్ర సిబ్బందిని అప్రమత్తం చేశాం. రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందించేలా ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం వరదల వల్ల దెబ్బతిన్న పంటలను అంచనాలు వేస్తున్నాం. ప్రాథమిక అంచనాల ప్రకారం, మిరప 71 హెక్టార్లు, బంతి 4 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తమ పంటలను వర్షాల నుంచి రక్షించుకోడానికిచ చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా నస్టాలను నివారించుకోవచ్చు. పంటలలో ఎటువంటి తేడాలు గమనించినా వెంటనే రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియజేయాలి. వాటిని పరిశీలించి తగిన జాగ్రత్తలు తెలియజేస్తాం. ప్రస్తుతం వరదల వల్ల మిరప, బంతి పంటలు దెబ్బతినే పరిస్థితులు ఉన్నందున అధికారుల సూచనలను రైతులు పాటించడం ద్వారా పంట నష్టం వాటిల్లకుండా చేసుకోవచ్చు. కాయగూరల రైతులు పంట కోత పూర్తి చేసుకోవాలి. అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలి. తగిన ఎరువులు వేయాలి. బంతి పంటకు సంబంధించి వీలున్నంతలో పంట కోత చేసుకోవడం మేలు.

– కె సత్య శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై మౌనిక అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామ హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల విద్యార్థులకు ఆత్మరక్షణ-కర్తవ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కొత్త చక్రరావు అధ్యక్షత వహించారు. ఎస్సై మౌనిక మాట్లాడుతూ, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, సామాజిక అంశాలపై మక్కువను పెంచుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలపై అవగాహన పెంచుకుని, విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థి చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి

కొత్తపల్లి: మొక్కలు నాటడం ద్వారా ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సూరడపేటలో ఉన్న మండల పరిషత్ పాఠశాలలో మంగళవారం ఆయన మొక్కలను నాటారు. విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు.

ఆగని వరద

- గొల్లప్రోలుకు ఏటా తప్పని ముంపు
- పుష్కర కాలువ, సుద్దగెడ్డతో పొంచి ఉన్న ముప్పు
- రూ.కోట్ల విలువైన పంటలు నీటిపాలు


గొల్లప్రోలులో పొంగి పొర్లుతున్న సుద్దగెడ్డ

పిఠాపురం: వరుస వరదలు వాణిజ్య, వరి, సెరికల్చర్ పంటలకు పుట్టినిల్లయిన గొల్లప్రోలు మండలాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఇక్కడి రైతులు ఆగని వరదలతో ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి కొన్నేళ్లుగా కొనసాగుతోంది. మరో అల్పపీడనం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్దగెడ్డ ఆధునికీకరణ చేయకపోవడం వల్ల ఏటా ఈ పరిస్థితి తప్పడం లేదు. వేలాది ఎకరాలకు సాగు నీరందించే ఏలేరు కాలువ ఈ మండలంలో ప్రజలకు, పంటలకు వరదగా మారి ఇబ్బందులకు గురి చేస్తోంది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఏలేరు నుంచి వచ్చిన అదనపు జలాలు గొల్లప్రోలు నగ రపంచాయతీతో పాటు, మండలంలో పలు గ్రామాలను నీట ముంచుతున్నాయి. మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు గొల్లప్రోలు మండలాన్ని నీట ముంచింది. రెండు వారాలుగా వేసిన వరి నాట్లు, పత్తి, మిరప, బంతి, చిక్కుడు, ఆగాకర, టమాటా, బొబ్బర్లు, వంగ, బెండ, దొండ, బీర తదితర పంటలు నీట మునిగాయి. సుద్దగెడ్డ పొంగి పొర్లుతుండడంతో గొల్లప్రోలు-సూరంపేట వద్ద రహదారులు నీట మునగడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది రోజుల క్రితం వచ్చిన వరద నుంచి తేరుకుంటున్న తరుణంలో, మరోసారి ముంచెత్తింది. దీంతో మండలంలో ఇప్పటివరకు సుమారు 1,700 హెక్టార్లలో వరి, పత్తి, మిరప ఇతర వాణిజ్య పంటలు వరద ముంపునకు గురైనట్టు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో మరింత వరద ఉధృతి పెరిగే అవకాశాలున్నట్టు అధికారులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి తదితర గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్దగెడ్డ పొంగి పొర్లుతుండడంతో లోతట్టు కాలనీలు నీట మునిగి, వీధులు చెరువులుగా మారుతున్నాయి.


గొల్లప్రోలు మండలంలో నీట మునిగిన పొలాలు(ఫైల్)


నీట మునిగిన ముగన తోట


ముంపులో పత్తి చేలు

జీఓలు సత్వరం విడుదల చేయాలి

- పీహెచ్‌సీల వద్ద ఆశా వర్కర్ల ధర్నా


ఆస్పత్రి వైద్యులకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

పెద్దాపురం: ఆశా వర్కర్లకు ఇచ్చిన మినిట్స్ ప్రకారం సత్వరమే జీఓలు విడుదల చేయాలని కోరుతూ మంగవారం పెద్దాపురం అర్బన్, రూరల్ పీహెచ్‌సీల వద్ద ఆశా వర్కర్లు ధర్నాలు నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరయు సీఐటీయూ ఆధ్వర్యంలో పులిమేరు, కాండ్రకోట, పెద్దాపురం పీహెచ్‌సీల్లో సంఘ నాయకులు ఈశ్వరి, దాడి బేబీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీల వద్ద ధర్నా నిర్వహించి, వైద్యులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం ప్రకారం, జీఓలు, సర్క్యులర్లు విడుదల చేయాలన్నారు. ప్రస్తుత నిత్యావసర ధరలకనుగుణంగా ఆశా వర్కర్లకు రూ.26 వేల వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు పని చేసే ప్రభుత్వ కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు తక్షణం ఏర్పాటు చేసి, నోడల్ అధికారులను నియమించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నాగరత్నం, సీత, వరలక్ష్మి, నాగమణి, లోవలక్ష్మి, ప్రమీల, చంటి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో నీరు బయటకు తీయాలి

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన


సామర్లకోటలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరి పొలాలు ముంపునకు గురయ్యాయని ఏడీఏ ఎస్ రత్న ప్రశాంతి, ఏఓ ఐ.సత్య తెలిపారు. మంగళవారం మండలంలోని పవన, పండ్రవాడ, చంద్రంపాలెం, నవర, సామర్లకోటల్లో నీట మునిగిన వరి పొలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ, ఎంటీయూ 1318, ఎంటీయూ 7029, బీపీటీ 5204, ఇతర సన్న రకాలను మండలంలో రైతులు సాగు చేశారన్నారు. ఎంటీయూ 1318 రకం ఐదు నుంచి ఆరు రోజుల వరకు పొలంలో నీరు ఎక్కువగా ఉన్నా తట్టుకుంటుందన్నారు. ప్రస్తుతం వరి పంట పిలకలు తొడిగే దశలో ఉన్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు వెంటనే పొలం నుంచి నీరు బయటకు పోయే మార్గాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు బయటకు తీసిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయడం ద్వారా పంట త్వరగా పుంజుకుని, పంట నష్టం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం ఆశించే తెగుళ్ల నివారణ కోసం ఒక గ్రాము కార్బండిజం లేదా రెండు గ్రాముల కార్బండిజంతో మాంకోజబ్ కలిపి పొలంలో పిచికారీ చేయాలన్నారు. డ్రోన్లను ఉపయోగించి తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులు పిచికారీ చేసే అవకాశం ఉందన్నారు. రైతులు నూతన సాంకేతిక పద్ధతులను అవలంబించాలని సూచించారు.

వంద రోజుల్లో ఇళ్లను నిర్మించాలి

- హౌసింగ్ పీడీ సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

సామర్లకోట: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను వేగంగా పూర్తి చేసి, పునాదిలో, శ్లాబ్ లెవెల్‌లో, పూర్తయిన ఇళ్లను గుర్తించి ఫొటోలతో అప్‌లోడ్ చేసి, బిల్లులు పెట్టాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లించాల్సిన మొత్తం గుర్తించడానికి వీలుంటుందని చెప్పారు. అదే విధంగా 2016 నుంచి 2019 వరకు నిర్మించిన ఎన్టీఆర్ ఇళ్లకు సంబంధించి వివరాలను ఈ నెల 10వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికి ఇచ్చిన టార్గెట్‌ను సకాలంలో పూర్తి చేయకపోతే కలెక్టర్ చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. బుధవారం జరిగే జెడ్పీ సమావేశంలో ఎన్టీఆర్ ఇళ్లకు చెందిన బిల్లుల బకాయిలపై ప్రజాప్రతినిధులు ప్రశ్నించే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సామర్లకోట మండలం హౌసింగ్ సర్వేలో వెనుకబడి ఉందని హౌసింగ్ ఈఈ వై శ్రీనివాసరావు అన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు మహిళా సంఘాల రుణాలు ఇప్పించడం ద్వారా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు ఉన్న వారందరికీ పని కల్పించాలన్నారు.

ఇసుక సమస్యను పరిష్కరించండి

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సమస్య ఎక్కువగా ఉందని, దానిని పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో దళారులు ఇసుకను తీసుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు ఇసుక ఇచ్చే ఏర్పాట్లు చేయాలని, ఈ మేరకు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. మండలంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బకాయిలను గుర్తించాలన్నారు. మండలంలో హౌసింగ్ కాలనీలకు సంబంధించి చేసిన పనులకు కాంట్రాక్టర్లకు రూ.4.80 కోట్ల బకాయిలు రావలసి ఉందని, ఆ మొత్తం చెల్లించేలా చూడాలన్నారు. హౌసింగ్ శాఖ వద్ద రికార్డు ఉందని, చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని పీడీ సత్యనారాయణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి శ్రీలలిత, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకరరావు, ఏఈ మొహమ్మద్ ముస్తాక్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఈటీసీలో పనివార్లకు సత్కారం


ఈటీసీలో తోటమాలి పనివార్లను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీలు

సామర్లకోట: మొక్కలను నాటి, సంరక్షించిన స్థానిక విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ)లో తోటమాలి పని చేస్తున్న వారిని ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో సత్కరించారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకుంటున్న వారి పనిని గౌరవించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈటీసీలో అమృత వనం పేరుతో ఏర్పాటు చేసిన పార్కులో సుమారు 150 మొక్కలు నాటారు. ఇందులో ప్రతి మొక్క బతకడంతో పాటు, పువ్వులు, కాయలు, పండ్లను ఇచ్చాయి. దీంతో తోటమాలి సేవలను గుర్తించాలని భావించి, వారిని సత్కరించామన్నారు. ఈటీసీ తోటమాలిలైన కామరాజు, గోపి, సురేష్, రామలింగంను సత్కరించారు. వన సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈటీసీలో మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్, ఫ్యాకల్టీలు జీవీఎస్ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, బి.వెంకటేశ్వర్లు, బి.ఆంజనేయులు, కేఎస్ఆర్ నిహారిక, పద్మజ, ఎస్‌కే మొహిద్దీన్ పాల్గొన్నారు.

వ్రత పురోహితులకు సత్కారం


వ్రత పురోహితులను సత్కరిస్తున్న సభ్యులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం వ్రత విభాగంలో పని చేసి, పదవీ విరమణ పొందిన ఐదుగురు పురోహితులను వ్రత పురోహిత సంఘం మంగళవారం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పురోహితులు దేవస్థానానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. వారు చేసిన సర్వీసు అనుసరించి గ్రాట్యుటీని స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు నాగాభట్ల వీరభద్రశర్మకు రూ.4.60 లక్షలు, మొక్కరాల రామకృష్ణకు రూ.4.20 లక్షలు, దేవులపల్లి భాస్కర్‌కు రూ.3.20 లక్షలు, సెకండ్ గ్రేడ్ వ్రతపురోహితులు భాగవతి వెంకటా చలపతికి రూ.రెండు లక్షలు, కనకదండి బాల సుబ్రహ్మణ్యానికి రూ.1.30 లక్షలు చెక్కులను ఈఓ అందజేశారు. అలాగే పదవీ విరమణ చేసిన పురోహితుల దంపతులకు రూ.పది వేల చొప్పున నగదు, నూతన వస్త్రాలతో వ్రత పురోహిత సంఘం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ పురోహితులు ప్రయాగ అంజిబాబు, మంధా రాంబాబు, చామర్తి జగ్గారావు, తొయ్యేటి హరిబాబు, సంఘ మాజీ అధ్యక్షుడు రవిశర్మ, ఏఈఓ పాలంకి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

దొంగ చేతికి తాళం ఇచ్చినట్టే..

- తాళం కప్ప కనిపించేలా వేయొద్దు
- కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ


తాళంకప్ప కనిపించేలా వేయవద్దని వివరిస్తున్న సీఐ చైతన్యకృష్ణ

కాకినాడ రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తలుపులకు తాళంకప్ప కనిపించేలా వేస్తే.. దొంగ చేతికి తాళం ఇచ్చినట్టే అవుతుందని కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ అన్నారు. ఇంటి యజమానులు లేరని గమనించి చోరీలకు పాల్పడేందుకు దొంగలకు అవకాశం కలుగుతుందన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఇంద్రపాలెం పీఎస్ పరిధిలో కొవ్వాడ, తిమ్మాపురం పీఎస్ పరిధిలో దొంగతనాలు జరిగాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చోరీల నియంత్రణ కోసం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రాత్రి పూట గస్తీలు నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ సెమీ అర్బన్ ఏరియాలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ఇంటికి తాళంకప్ప బయటకు కనిపించే చోటే ఎక్కువగా చోరీలు జరిగినట్టు గుర్తించామన్నారు. ప్రధాన ద్వారం తాళం కనిపించకుండా, కనీసం కర్టెన్ అయినా వేయాలన్నారు. ఊరు వెళ్లేటప్పుడు బంగారు, వెండి వస్తువులు, నగదు ఇంట్లో ఉంచరాదన్నారు. బంధువుల ఇళ్ల వద్ద కానీ, లాకర్లలో కానీ భద్రపర్చుకోవాలన్నారు. కనీసం పోలీసు వారు కల్పించే లాకర్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్ఎంఎస్)ను వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ఇవేమీ పట్టించుకోకుండా, ఇంట్లో విలువైన వస్తువులు పెట్టి వెళుతున్నారన్నారు. ఇళ్ల వద్ద, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు బంగారు ఆభరణాలు వేసుకుని వెళ్లినప్పుడు చైన్ స్నాచర్ల ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో బీట్లు పెంచి, నిఘా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఇంద్రపాలెం, తిమ్మాపురం ఎస్సైలు మణికుమార్, రవీంద్రబాబు పాల్గొన్నారు.